www.prajasakti.com

# ప్రజాశక్తి

శనివారం 11 నవంబర్ 2023

5

పశ్చిమ గోదావరి



## సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందిన వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి, శాశ్వత పరిష్కారం చూపాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.అచ్యుత అంబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక గ్రీవెన్స్ మండల స్థాయి కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి ఆర్‌డిఒ పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంలో వచ్చిన ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యకు సంబంధించిన ఫోటోలను పరిష్కార నివేదికకు జత చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారి కెసిహెచ్ అప్పారావు, ప్రత్యేకాధికారి వి.విజయ లక్ష్మి, తహశీల్దార్ జి.అనిత కుమారి పాల్గొన్నారు.

# దాళ్వాకు నీళ్లిస్తారా..!



- ఇంకా జరగని జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం
- గోదావరి జలాలపై తర్జనభర్జనలు
- సీలేరు, పోలవరం ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలపైనే ఆధారం
- రెండు జిల్లాలకు దాదాపు 70 టిఎంసిలు అవసరం
- ఖరీఫ్‌లో కరువుతో తీవ్రంగా నష్టపోయిన రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దాళ్వాసాగుకు నీటి సరఫరాపై ఇప్పటికీ ప్రభుత్వం తేల్చలేదు. ఖరీఫ్ మాసూళ్లు ప్రారంభమయ్యాయి. దాళ్వా నారుమడులు వేసేందుకు మరోపక్క రైతులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ దాళ్వాలో సాగునీటికి సంబంధించి జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం జరగలేదు. పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరిస్తారా.. లేక ఆంక్షలు ఏమైనా విధిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాళ్వాలో 4.60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆయకట్టు పరిధిలో 4.36 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. రెండు జిల్లాల్లోనూ దాళ్వాసాగుకు పూర్తిస్థాయిలో నీరందించాలంటే 70 టిఎంసిల వరకూ నీరు అవసరం. వరద నీటి ప్రకారం గోదావరి నుండి లభ్యత అంచనాలు 36 టిఎంసిల వరకూ ఉండే అవకాశం ఉంది. సీలేరు నుంచి ఎంత లభ్యత ఉంటుందో, పోలవరం ప్రాజెక్టు వద్ద నిల్వ ఉన్న నీటిని దాళ్వాకు ఉపయోగించేందుకు ఇరిగేషన్ అధికారులు లెక్కలు కడుతున్నట్లు తెలుస్తోంది. సాగునీటికి సంబంధించి లెక్కలపై స్పష్టత వస్తే తప్ప దాళ్వా పరిస్థితి ఏమిటో అర్థం కాదు. కొంతకాలంగా వంతులవారీ విధానంలో దాళ్వాకు సాగునీరు అందిస్తున్నారు. జనవరి దాటిన తర్వాత సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాల విభజన అనంతరం రెండు జిల్లాల్లో దాదాపు 3.50 లక్షల ఎకరాల వరకూ దాళ్వాలో వరి సాగవుతోంది. ఈ సాగుకు నీరెలా అందిస్తారో ప్రణాళికలు ఇప్పటికీ వెల్లడించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సాగులో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. దిగుబడులపై సైతం తీవ్ర ప్రభావం పడనున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ తరుణంలో దాళ్వాలో సాగునీటి ఇబ్బందులు తలెత్తితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడనుంది. దాళ్వాలో సాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**కష్టాల సుడిలో అన్నదాత**

ఖరీఫ్‌లో వర్షాలు పడక పంటలపై తీవ్ర ప్రభావం పడింది. ఏలూరు జిల్లాలో లక్షా 98 వేల ఎకరాల్లో వరిసాగు సాగగా ప్రాథమిక అంచనాల్లో 12 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు స్పష్టమైంది. ఇంకా పరిస్థితి మరింత దారుణంగా ఉండనుందని తెలుస్తోంది. పెట్టుబడులు పెట్టిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ జిల్లాలో ఏఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించకుండా తాత్సారం చేస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఖరీఫ్‌లో 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండల తీవ్రతకు దిగుబడులు తగ్గనున్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. దీంతో దాళ్వా సాగుపైనే రైతులంతా గంపెడాశలు పెట్టుకున్నారు. దాళ్వాసాగుకు నీటి సరఫరాపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అప్పుడే రైతులు ప్రణాళికతో ఉంటారు. ఈ నెల 14న ఏలూరు జిల్లాలో సాగునీటి సలహా మండలి సమావేశం జరగనున్నట్లు చెబుతున్నా అధికారికంగా మాత్రం ప్రకటన వెలువడలేదు. దాళ్వాకు సాగునీటిపై ఇరిగేషన్ జిల్లా అధికారి వివరణ కోసం ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



భీమవరంలో నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

# ఇజ్రాయిల్ తీరు అత్యంత దుర్మార్గం

## పాలస్తీనాపై దాడికి వామపక్షాల ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం

ఇజ్రాయిల్ పాలస్తీనాపై అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. స్థానిక ప్రకాశంచౌక్ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావంగా శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై నరమేధానికి పాల్పడిందన్నారు. 10 వేలకు పైగా చిన్నపిల్లలు, మహిళలను పొట్టన పెట్టుకుందన్నారు. క్షతగాత్రులకు చికిత్సలు అందిస్తున్న ఆసుపత్రులపై బాంబులతో దాడిచేసి మారణకాండకు పాల్పడిందన్నారు. అందరం ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని ఖండించాలన్నారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలపాలన్నారు. దేశ ప్రధాని మోడీ అమెరికాకు వత్తాసు పలకడమంటే అత్యంత హేయమైన చర్య అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఈ దాడుల్లో 10,418 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారన్నారు. ఫార్వర్డు బ్లాకు జిల్లా నాయకులు లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ పాలస్తీనీయులకు సంఘీభావంగా ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో చెబుతున్నా దాడులు మాత్రం ఇంకా జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రపంచ దేశాల నుంచి సహకారం అందనివ్వకుండా అన్ని దారులూ మూసేసి పాలస్తీనీయులను హింసకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, బి.వాసుదేవరావు సిపిఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో నిరసన తెలియజేస్తున్న నేతలు

**తణుకు రూరల్ :** పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించిన, ఇజ్రాయిల్‌కు భారత్ మద్దతివ్వడం సిగ్గుచేటని సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు పివి.ప్రతాప్, బొద్దాని నాగరాజు విమర్శించారు. శుక్రవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రతాప్ మాట్లాడుతూ ఈ రోజు ఇజ్రాయిల్‌గా చెప్పబడుతున్న దేశం ఒకప్పుడు లేనేలేదన్నారు. పాలస్తీనా జాతిని నిర్మూలించే దిశగా అమెరికా ఆదేశాలకనుగుణంగా ఇజ్రాయిల్ నడుస్తోందన్నారు. ఆయిల్, చమురు ఉన్న అరబ్ దేశాలపై పెత్తనం చేయడానికే పాలస్తీనాను నాశనం చేస్తున్నారన్నారు. 34 రోజులుగా యుద్ధం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం వచ్చిందన్నారు. యుద్ధాన్ని ఆపి పాలస్తీనాకు రక్షణ కల్పించాల్సిన ఐక్యరాజ్య సమితి ప్రేక్షకుడిలా మారిపోవడం బాధాకరమన్నారు. దేశ ప్రజలు పాలస్తీనాకు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.అజయకుమారి, గార రంగారావు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** వామపక్షాల పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్, సిపిఎం ఆధ్వర్యంలో అమెరికా రక్షణ మంత్రి గోబ్యాక్ అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తెలిపారు. అమెరికా దేశానికి భారతదేశాన్ని జూనియర్ భాగస్వామిగా తయారు చేసిన ఘనత మోడీకే దక్కిందన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడికి ఐక్యరాజ్యసమితి ఖండించిందని ప్రధాని ఇజ్రాయిల్‌కు మద్దతు తెలిపారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, ఎ.ఆంజనేయులు, ఎస్‌విఎస్ రెడ్డి కర్రి సుబ్బిరెడ్డి, గాది వెంకట్రావు, ఎన్.కృష్ణ సత్తి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్‌కు సిపిఎం అగ్ర నేతల పరామర్శ

## విజయవాడ ప్రజారక్షణ భేరి బహిరంగ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) జీవితం నేటి యువతరానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి స్ఫూర్తిదాయకమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ కొనియాడారు. సిపిఎం చేపట్టిన రాష్ట్ర బస్సు యాత్ర భీమవరం చేరుకున్న సందర్భంగా యాత్ర బృందం, రాష్ట్ర, జాతీయ నాయకులు ఆర్ఎస్‌ను మర్యాదకపూర్వకంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ ఆర్ఎస్‌ను కలవడం సంతోషకరమన్నారు. మహానేత పుచ్చలపల్లి సుందరయ్యతో ఉద్యమాలు చేసిన నేతల్లో ఆర్ఎస్ ఒకరన్నారు. ఆర్ఎస్ జీవితం, ఉద్యమ పటిష్టత నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో పశ్చిమగోదావరి జిల్లా నిర్మాతగా, మాజీ ఎంఎల్ఎగా ఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. నేటితరం కమ్యూనిస్టులకు, నేటి ఉద్యమాలకు ఎన్నో సలహాలు సూచనలు ఇస్తున్నారని తెలిపారు. ఆర్ఎస్ స్ఫూర్తితో నేడు దేశంలో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామని ప్రతిన బూనారు. బిజెపి ప్రభుత్వం వచ్చాక ప్రజల మధ్య అనేక మత, కుల ఘర్షణలతో చీలుస్తోందన్నారు. ప్రతి పేద కుటుంబానికీ భూ పంపిణీ జరిగే వరకూ పోరాడతామన్నారు. అనంతరం ఆర్ఎస్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 15వ తేదీన జరిగే సిపిఎం ప్రజారక్షణ భేరి భారీ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాధం, రాష్ట్ర నేతలు కెవి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, కె.శ్రీనివాస్, ఎం.హరిబాబు, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

# ప్రతిభా ప్రదర్శనకు బాలోత్సవాలు తోడ్పడాలి

**తణుకురూరల్:** బాల బాలికల్లో నిగూఢంగా ఉన్న ప్రతిభా, సామర్థ్యాల ప్రదర్శనకు బాలోత్సవాలు తోడ్పడాలని ప్రగతి కాలేజీ డైరెక్టర్ ఎంఎస్ఆర్ ఆంజనేయులు (ప్రగతి రాజా) అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బాలోత్సవం (పిల్లల సంబరాలు) సన్నాహక సమావేశం పి.దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు (రాజా) మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధనల పట్ల ఉంటే ఆసక్తిని ప్రోత్సహించడానికి, విద్య, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహించడానికి ఈ బాలోత్సవాలు నిర్వహించాలనుకోవడం అభినందనీయమన్నారు. దీనికి పూనుకున్న శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్ర నిర్వాహకులకు పట్టణంలోని అన్ని పాఠశాలలూ సహకరించాలన్నారు. శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు పి.దక్షిణామూర్తి, పిఎల్ నరసింహారావు మాట్లాడారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యా సంస్థలు, ప్రజా సంఘాల సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బాలోత్సవాల నిర్వహణకు మద్దతు తెలిపారు. అనంతరం బాలోత్సవాల లోగోను ఆవిష్కరించారు.

# 25 నుంచి టిడ్కో గృహాల పంపిణీ

## ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభించి వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి దపదపాలుగా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగిస్తామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో ఇప్పటికే మొదటి విడతగా లబ్ధిదారులకు ఎంఎల్ఎ శ్రీనివాస్ 2 వేల టిడ్కో గృహాలను పంపిణీ చేశారు. మిగిలిన 6,368 మందికి పంపిణీ చేయడానికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం టిడ్కో ఉన్నత అధికారులు, కాంట్రాక్టు సంస్థ అధికారులతో గ్రంధి సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడ్కో పథకంలో మొత్తం 8,368 మంది లబ్ధిదారులు ఉన్నారని, మొదటి విడతగా 2 వేల గృహాలను లబ్ధిదారులకు అందించామని తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభించి జనవరి నెలాఖరు వరకూ దపదపాలుగా అప్పగిస్తామని తెలిపారు. 25న 960 మందికి, డిసెంబర్ 10న 640 మందికి, డిసెంబర్ 30న 2 వేల 48 మందికి, వచ్చే ఏడాది జనవరి 15న 1376 మందికి, జనవరి 31వ తేదీన 1344 మందికి టిడ్కో గృహాలను పంపిణీ చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించరాదన్నారు. సకాలంలో పనులు పూర్తిచేయాలన్నారు. టిడ్కో గృహాల్లో నివసిస్తున్న ప్రజలు వాడిన నీటిని శుద్ధి చేసే ఎస్‌టిపి ట్యాంక్ పనులు త్వరలోనే ముగుస్తాయన్నారు. 95 శాతం పూర్తయిన గృహాల నిర్మాణానికి సంబంధించి ఫినిషింగ్ వర్క్ ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని ఆయన అధికారులను ప్రశ్నించారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, టిడ్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వామి నాయుడు, కాంట్రాక్టు సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రమౌళి, సైట్ ఇన్‌ఛార్జి గౌతమ్, పార్టీ నాయకులు తోట భోగయ్య, కోడే యుగంధర్, కొప్పర్తి వీర రాఘవులు పాల్గొన్నారు.

# సర్పంచి వేణుకకు న్యాయం చేయాలి

## లేకుంటే మరో గరగపర్రు ఉద్యమం తప్పదు : కెవిపిఎస్ నేతలు



నవుదూరులో సర్పంచి నుండి వివరాలు తెలుసుకుంటున్న కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి - వీరవాసరం

నవుదూరు సర్పంచి నల్లిమెల్లి వేణుక ఆత్మాభిమానం దెబ్బతినే విధంగా ప్రవర్తించిన ఆ గ్రామ ఉపసర్పంచి బొట్టా మునేంద్రరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయకపోతే మరో గరగపర్రు తరహా ఉద్యమం చేస్తామని కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. ఉపసర్పంచి తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని, ఎస్‌సి, ఎస్‌టి ప్రకారం చర్యలు తీసుకోవాలని సర్పంచి వేణుక పోలీస్ స్టేషన్, స్పందనలో ఫిర్యాదు చేశారు. అయితే ఆమె ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడంతో ఆమె కెవిపిఎస్‌ను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో నిజనిర్ధారణ బృందం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, గరగపర్రు ఉద్యమ నాయకులు సిరింగుల వెంకటరత్నం శుక్రవారం నవుదూరులో పర్యటించారు. సర్పంచి వేణుక నుంచి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచికి అవమానం జరిగిన సమయంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు వార్డు సభ్యులు ఆమెకు జరిగిన అవమానం, ఉపసర్పంచి ప్రవర్తించిన తీరు బృందానికి చెప్పారు. అనంతరం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ఒక ఎస్‌సి మహిళా సర్పంచి ఆత్మాభిమానం దెబ్బతినే విధంగా ఉపసర్పంచి మునేంద్రరావు ప్రవర్తనను సహించేది లేదన్నారు. తక్షణం పోలీసులు, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. సామాజిక న్యాయం పేరుతో బస్సుయాత్ర చేస్తున్న వైసిపి నాయకులు అదే పార్టీకి చెందిన ఒక ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన సర్పంచికి అవమానం జరిగితే ఆ పార్టీ నాయకులు ఏంజేస్తున్నారంటూ ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ సర్పంచి వేణుక తనకు జరిగిన అవమానం పట్ల తిరగబడ్డారు కాబట్టి సరిపోయిందని, లేకపోతే మరిన్ని అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చేదని తెలిపారు. డిఎస్‌పి స్థాయి అధికారికి సర్పంచి స్వయంగా వెళ్లి ఫిర్యాదు చేస్తే స్పందించరా అంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచి ఎక్కడ కూర్చోవాలో ఉపసర్పంచి నిర్ధారిస్తాడా అని ప్రశ్నించారు. ఈ విధమైన దురంహకార ప్రవర్తన సహించేది లేదన్నారు. భవిష్యత్తులో మరోసారి ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. సర్పంచికి జరిగిన అన్యాయం కలెక్టర్‌కు తెలిసి ఉంటే ఈ ప్రాంతంలో తక్షణం పర్యటించాల్సి ఉన్నా అలా జరగలేదన్నారు. కార్యదర్శిని వెంటనే ఇక్కడ నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం సర్పంచికి జరిగిన అవమానంపై, ఉపసర్పంచికి మద్దతుగా ఉన్న వారిపైనా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పరిసర గ్రామ ప్రజలతో ఉద్యమిస్తామని తెలిపారు. గరగపర్రు ఉద్యమ నేత సిరింగుల వెంకటరత్నం మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రశ్నించిన దళితులను చంపుతోందన్నారు. రిజర్వేషన్‌లో భాగంగా వేణుక సర్పంచిగా ఎన్నికైందని, పెత్తందారులు కట్టబెట్టిన పదవి కాదని తెలిపారు. న్యాయం పక్కన నిలబడిన వార్డు సభ్యులు మల్లుల రామలక్ష్మి, కరీంశెట్టి వెంకటలక్ష్మిని అభినందించారు. మరో దళిత రాష్ట్ర నాయకుడు గొట్టుముక్కల ప్రభాకరరావు మాట్లాడుతూ ఒక దళిత సర్పంచికి అవమానం జరిగితే ఆ మహిళకు అండగా నిలవడం మాని ఆమెకు వ్యతిరేకంగా అవమానించిన వారికి అనుకూలంగా కొంత మంది దళిత నాయకులు ఖండన ఇవ్వడం బాధాకరమన్నారు. వారిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కోరం ముసలయ్య, వార్డు సభ్యులు, నల్లిమెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు టిడ్కో గృహాలివ్వాలని పాదయాత్ర

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు ఇవ్వాలని కోరుతూ వార్డుల్లో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఒకటో వార్డు నుంచి పదో వార్డు వరకూ జరిగిన పాదయాత్రలో లబ్ధిదారులను కలిసి ఈ నెల 15వ తేదీన తలపెట్టిన పాలకొల్లు చూడు కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. లబ్ధిదారులు, మహిళలకు న్యాయం జరిగేవరకూ తమ ఉద్యమం ఆగదని చెప్పారు. జగన్ ప్రభుత్వం దగా, మోసం చేసినా పేదలు, మహిళలకు తాము అండగా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. జగన్ ప్రభుత్వం కళ్లు తెరిచేలా ఈ నెల 15వ తేదీన తలపెట్టిన పాలకొల్లు చూడు వినూత్న కార్యక్రమంలో పెద్ద ఎత్తున వంటా వార్పు, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో 90 శాతం పూర్తయిన టిడ్కో గృహాలను మిగిలిన 10 శాతం పూర్తిచేసి అందరికీ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలను నివాస ప్రాంతాల్లోనే ఇవ్వాలన్నారు.

# ప్రజల సంక్షేమానికే పెద్దపీట

## రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు



జక్కరంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు)

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. జక్కరం, కాళ్ల గ్రామ సచివాలయ పరిధిలో 'వై నీడ్స్ ఎపి జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 2019 జూన్ నుంచి 2023 జూన్ వరకూ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, జగనన్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను జక్కరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిలాఫలకాన్ని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో పివిఎల్ నరసింహరాజును ఎంఎల్ఎగా గెలిపించాలని కోరారు. ఆయన పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాళ్ల గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల శిలాఫలకాన్ని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన ఓ వైపు, కరోనా మహమ్మారి మరోవైపు వెరసి ఆర్థిక లోటు నేపథ్యంలోనూ జగన్మోహన్‌రెడ్డి అత్యంత సమర్థవంతంగా ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, ఉప సర్పంచి కూచంపూడి లక్ష్మీపతిరాజు, జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయరామ కృష్ణంరాజు, ఎం.అశోక్, పి.రామారావు, అధికారులు పాల్గొన్నారు.

# పిఆర్ 126 రకం సాగుకు అనుమతివ్వాలి

ప్రజాశక్తి - భీమవరం

పిఆర్ 126 రకం సాగుకు అనుమతివ్వాలని కౌలు రైతుల సంఘం కోరుతున్నా, రానున్న దాళ్వా సాగుకు పిఆర్ 126 రకం నాట్లు వేయొద్దని, ఆ పంట సాగుచేస్తే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయదని జిల్లా కలెక్టర్ చేసిన ప్రకటనను రాష్ట్ర కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ వ్యతిరేకించింది. ఈ మేరకు కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత దాళ్వాకు పోడూరు, యలమంచిలి, ఆచంట, అత్తిలి, ఇరగవరం మండలాల్లో రైతులు పిఆర్ 126 రకం సాగుచేశారని పేర్కొన్నారు. ఈ రకం 1156, 1153 రకాల కంటే ముందుగా కోతకొచ్చిందని, ఎకరాకు 55 బస్తాల నుంచి 70 బస్తాల వరకూ దిగుబడి వచ్చిందని తెలిపారు. ఈ రకం ధాన్యాన్ని ప్రభుత్వం గ్రేడ్-1గా నమోదు చేసి కొనుగోలు చేసిందని తెలిపారు. మిల్లర్లు కూడా ఈ రకం ధాన్యం కొనుగోలుకు ముందుకొచ్చారని తెలిపారు. రైతులకు మంచి దిగుబడి ఇచ్చి, పంట ముందుగా వచ్చి రైతులకు లాభసాటిగా ఉన్న పిఆర్ 126 రకం ధాన్యం ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయదో సమాధానం చెప్పాలని కోరారు. పంటలు సాగుచేసే కౌలు, పేద రైతులు వాతావరణం, సాగునీరు, దిగుబడి వంటి విషయాల్లో వారికి నచ్చిన పంట సాగు చేస్తారని, ప్రభుత్వం రైతులకు స్వేచ్ఛ లేకుండా పలానా పంటే సాగుచేయండి లేకపోతే ఆ పంటను కొనుగోలు చేయబోమని చెప్పడం దారుణమని పేర్కొన్నారు. గతేడాదిలా పిఆర్ 126 రకం సాగుకు అనుమతిచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



పెనుమంట్ర : పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

## ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర :

అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం రోజున చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం ఇదే మొదటిసారని జన విజ్ఞాన వేదిక జిల్లా సహాయ కార్య దర్శి చింతపల్లి కిరణ్ అన్నారు. మండల పరిధిలోని తొమ్మిది హైస్కూల్స్ నుంచి సుమా రు 360 విద్యార్థులు చెకుముకి పరీక్ష రాశారు. ఈ పరీక్షను ఎంఇఒ ఉంగరాల నాగేశ్వం రావు పర్యవేక్షించారు. కార్యక్రమాన్ని మండల కన్వీనర్ డి.సుధీర్ పర్యవేక్షించారు.

**భీమవరం రూరల్ :** అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా శుక్రవారం చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షను నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవ సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.ఎం.నిర్మలాకుమారి, బి.రాధామణి, ఎన్‌డివి.ప్రసాద్, ఎంవి.శ్రీలక్ష్మి, డి.అనురాధ, బికె.రాజేష్‌కుమార్‌రాజు, జి.ఎస్.విజయలక్ష్మి, సిహెచ్.శ్రీనివాస్, జ్యోత్స్న, డి.కనకరత్నం, వై.శకుంతల, ఎం.బాల పల్లాలరాజు పాల్గొన్నారు.

## ప్రజారక్షణభేరి జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని వెంప గ్రామం పెదపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద 15న చలో విజయవాడ ప్రజా రక్షణ భేరి వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంద మార్తమ్మ, మీసరపు ప్రసన్న, ఇంజేటి మరియమ్మ, కె.మోహన్‌రావు, నేతలు చిలకపాటి శకుంతల, మంద నాగరత్నం పాల్గొన్నారు.

**గణపవరం :** ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజారక్షణభేరి సభ జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పిప్పర సబ్‌స్టేషన్‌కాలనీ వద్ద శుక్రవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి మాట్లాడుతూ బహిరంగ సభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పి.గోవిందు, శ్రీను పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - వీరవాసరం

పాలకులు, అధికారులు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ప్రజా పోరాటాలు చేస్తామని సిపిఎం హెచ్చరించింది. సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని వీరవాసరం సిపిఎం కార్యాలయంలో పెర్కిపాలెం గ్రామ శాఖ కార్యదర్శి బొర్రా ఆలమహారాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ పెర్కిపాలెంలో కొన్ని సంవత్సరాలుగా కలుషిత తాగునీరు, డ్రెయినేజీ, చెత్తకుప్పలు, సీసీ రహదారుల సమస్యలను ఆ గ్రామ సర్పంచి, అధికారులు ఎందుకు పరిష్కరించడలేదని ప్రశ్నించారు. గ్రామంలో అపారిశుద్ధ్య పరిస్థితుల వల్ల గ్రామస్తులు అనారోగ్యపాలవుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు. ఈ సమావేశంలో బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, యాళ్లబండి నారాయణమూర్తి, గొట్టుముక్కల శ్యాంబాబు పాల్గొన్నారు.

## నేడు నరసాపురం డిపోలో డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిపోలో ఈ నెల 11వ తేదీన డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజారవాణా సేవలు, కార్గో సేవలు, కార్గో డోర్ డెలివరీ గురించి, విద్యార్థులకు రాయితీలు, శుభకార్యములకు విహారయాత్రకు ప్రత్యేక బస్సు లు, సిబ్బంది ప్రవర్తన, సూచనలు, ఫిర్యాదులు, అందించడానికి వీలుగా డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిపో మేనేజర్ సత్తిసుబ్బన్న రెడ్డి 995922548 సంప్రదించి సమస్యలను తెలియజేయాలని చెప్పారు.

## న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన న్యాయవాది బి.శ్యామ్‌బాబుపై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడి చేసిన వారిపై చట్ట ప్రకారం పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు తోట మురళి, గీతారెడ్డి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు దాశరథరామ్, ఆదినారాయణ, కొయ్య వెంకటేశ్వరరావు, ఇందిర, సౌదామిని, అద్దంకి ప్రవీణ్, మద్ద శ్రీను బాబు పాల్గొన్నారు.

## 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల పుస్తకాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు వివిధ

**గణపవరం :** మండలంలోని పిప్పర గ్రంథాలయంలో ఈ నెల పదో తేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ 56 జాతీయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పి.రంగారావు తెలిపారు. మాజీ మంత్రి ఇందుకూరు రామకృష్ణంరాజు శుక్రవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

## 'అసమర్ధ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి'

ప్రజాశక్తి - ఉండి

రాజధాని నిర్మాణం చేయలేని, నిరుద్యోగ యువతకు ఉపాధి చూపలేని అసమర్ధ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఉండి ఎంఎల్ఎ మంతెర రామరాజు అన్నారు. ఉండి కొత్తపేట ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేకూరే లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో యువకులు అధిక సంఖ్యలో పార్టీలో చేరారు.

# అదుపు తప్పిన ఆర్‌టిసి బస్సు

### ద్విచక్ర వాహనదారుడు మృతి

### బస్సు కండిషన్ సరిగా లేదని తెలిపిన డ్రైవర్

ప్రజాశక్తి - వీరవాసరం



సంఘటన ప్రాంతంలో బస్సు

విజయవాడ బస్టాండ్‌లో ఆర్‌టిసి బస్సు దూసుకెళ్లిన సంఘటన మరువక ముందే అదే తరహాలో మరో ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి ఒక పక్క నుంచి మరో పక్కకు దూసుకెళ్లింది. వీరవాసరం జాతీయ రహదారిపై శుక్రవారం మండల కార్యాలయాల సముదాయం ముఖద్వారం వద్దకు దూసుకొచ్చి ద్విచక్రవాహనదారుడిని ఢీ కొట్టడంతో అతను మృతి చెందాడు. మృతుడు పాలకొల్లు మండలంలోని తిల్లపూడి గ్రామానికి చెందిన కాజా శ్రీనివాసరావు (52)గా పోలీసులు గుర్తించారు. మృతుని మేనల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. భీమవరం డిపోకు చెందిన బస్సు పాలకొల్లు నుంచి భీమవరం వైపు వెళ్తుంది. సంఘటన జరిగిన ప్రాంతానికి వచ్చేసరికి రోడ్డుకు ఎడమ పక్కగా వెళ్తున్న బస్సు అదుపుతప్పి ఒక్కసారిగా కుడి పక్కకు దూసుకొచ్చిందని స్థానికులు తెలిపారు. బస్సు కండిషన్ సక్రమంగా లేకపోవడంతో అదుపు తప్పిందని డ్రైవర్ తెలిపాడని ఎస్ఐ చెప్పారు. దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉందన్నారు. బస్సు బ్రేక్ వేస్తుంటే కుడి పక్కగు లాగేస్తుందని, ఈ విషయం బస్సును డిపో నుంచి తీసుకున్నప్పుడే అక్కడ ఉన్న పరిశీలన అధికారులకు తెలిపానని, బస్సులు తక్కువగా ఉండటం వల్ల తీసుకెళ్లమన్నారని ప్రాథమిక విచారణలో డ్రైవర్ తెలిపినట్లు ఎస్ఐ చెప్పారు. అధికారులు, ప్రజలు మండల కార్యాలయాల వద్దకు నిత్యం వస్తూ ఉంటారు. ఇదే ప్రాంతంలో అక్కడే ఉన్న వెల్డింగ్ షాపులో నిత్యం పని చేసుకుంటూ ఉంటారు. ప్రమాద సమయంలో అక్కడ అంతగా జనసంచారం లేదని, లేకపోతే ఎక్కువ స్థాయిలో ప్రాణనష్టం జరిగి ఉండేదని పలువురు తెలిపారు.

# మాకెంత..?

### మందుగుండు సామగ్రి దుకాణాదారులతో కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ బేరసారాలు!

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వ్యాపారుల లావాదేవీల్లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును వసూలు చేయాల్సిన కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్స్ దీపావళి మందు గుండు సామగ్రి అమ్మకాల్లో మాకెంత ఇస్తారని బేరసారాలు ఆడటంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ.కోట్లలో జరిగే వ్యాపార లావాదేవీల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పలువురు వాపోతున్నారు. దీపావళి పండుగ సందర్భంగా స్థానిక లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో సుమారు 40 వరకు మందు గుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు.

**దుకాణాల వద్ద కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ బేరసరాలు**

మందుగుండు సామగ్రి దుకాణాల వద్ద ఉన్న స్టాక్‌ను బట్టి ట్యాక్స్ వసూలు చేయాలి. కాని భీమవరం కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్‌లో పనిచేసే ఒక అధికారి నూతన హైస్కూల్ గ్రౌండ్‌లో ఉన్న ఒక షాపు యజమాని వద్దకు వెళ్లి రూ.మూడు వేలు, మందు గుండు సామగ్రి ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాపు యజమాని తమ సిండికేట్‌లో ఐదు షాపులు ఉన్నాయని, దుకాణానికి రూ.రెండు వేలు ఇచ్చుకోగలమని చెప్పడంతో బేరం కుదుర్చుకుని వారికి కావాల్సిన మందు గుండు సామగ్రిని అట్ట బాక్సుల్లో ప్రత్యేకంగా ప్యాక్ చేయించుకుని తీసుకెళ్లారు. ఇదంతా చూసిన కొనుగోలుదారులు అవినీతిని అడ్డుకోవాల్సిన అధికారులు ఇలా చేయటం ఏంటని విమర్శిస్తున్నారు.



సిటిఒ పేరుతో అట్టపెట్టెలో మందు గుండు సామగ్రి

## గుండెపోటుతో వర్ధనపు బాబూరావు మృతి

ప్రజాశక్తి - ఆచంట



బాబూరావు (ఫైల్)

లీగల్ మెట్రాలజీ (తూనికలు కొలతలు) డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యి ప్రస్తుతం పాలకొల్లు కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న వర్ధనపు బాబూరావు (69) గురువారం తెల్లవారుజామున పాలకొల్లులోని తన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య జాన్సి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య జాన్సి స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసి రిటైర్ అవ్వగా, పెద్ద కుమారుడు బాబి కిరణ్, జర్మనీలో, చిన్న కుమారుడు బిజు గౌతమ్, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. మండలంలోని పెనుమంచిలి పంచాయతీ పరిధి తూర్పు గరువుకు చెందిన వర్ధనపు బాబూరావు తన కుటుంబ సభ్యులతో ఇటీవలే పాలకొల్లులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం అక్కడే నివాసం ఉంటున్నారు. ఆయన మృతదేహాన్ని పలువురు ఉద్యోగులు, న్యాయవాదులు, వివిధ పార్టీ నాయకులు, గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శనివారం సాయంత్రం పెనుమంచిలి తూర్పు గరువులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## రైతు భరోసా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలో రైతు భరోసా కేంద్రాలను భీమవరం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సార్వా కోత గురించి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులతో చర్చించారు. ధాన్యాన్ని సేకరించే వాహనాలను సరిగా జిపిఎస్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండలో ఐదు సచివాలయాల పరిధిలో ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## 17, 18 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంగన్‌వాడీ సమస్యలపై ఈ నెల 17వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద, 18వ తేదీన ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహించే రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కల్యాణి పిలుపునిచ్చారు. మార్టేరు గౌరీశంకర్ దేవాంగ యువజన సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో ప్రాజెక్ట్ స్థాయి అంగన్‌వాడీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం అంగన్‌వాడీ జిల్లా సహాయ కార్యదర్శి పి.తులసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు కూసంపూడి సుబ్బరాజు పాల్గొన్నారు.

**15న విజయవాడలో..**

**పోడూరు :** మండల కేంద్రమైన పోడూరులో అంగన్‌వాడీ ప్రాజెక్టు జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా అంగన్‌వాడీ కార్యదర్శి కల్యాణి, జిల్లా ఉపాధ్యక్షులు వైట్ల రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన విజయవాడలో రిలే నిరాహార దీక్షలు, డిసెంబర్ ఎనిమిదో తేదీన సమ్మె రిపరేషన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## డైమండ్స్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అంతర్జాతీయ లయన్స్ క్లబ్ పిలుపు మేరకు డైమండ్స్ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవా కార్యక్రమం స్ఫూర్తిదాయకయని సామాజిక సేవకుడు బాల బొమ్మల శ్రీనివాస్ అన్నారు. స్థానిక పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో పేరిచర్ల ఫౌండేషన్ సభ్యులు లయన్ పేరిచర్ల వీరభద్ర రాజు పుట్టినరోజు సందర్భంగా డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు వృద్ధులకు శుక్రవారం అన్నదానం చేశారు. సభ్యుల పుట్టినరోజు, పెళ్లిరోజున పేదలకు కడుపు నింపేలా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు జోన్ చైర్ పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సూచనలు చేయడం అభినందనీయమని, పేదలకు ఆసరాగా డైమండ్స్ లయన్స్ క్లబ్ ఉంటుందని బాలబొమ్మల శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ ఫుడ్ కమిటీ కో-ఆర్డినేటర్ కుందుం వెంకటేశ్వరరావు, కె.సాయి, సత్యనారాయణరాజు, వశిష్ఠ లియో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి రక్తదాత ప్రాణదాతే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రక్తదానం చేసే ప్రతిఒక్కరూ ప్రాణదాతతో సమానమని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. నిట్‌లోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మనిస్తారని చెప్పారు. అనంతరం రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ ప్లానింగ్, డెవలప్‌మెంట్ డాక్టర్ ఎన్.జయరామ్ రక్తదానం చేసి విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు పావని ఆధ్వర్యంలో సిబ్బంది మొత్తం 210 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అధికారులు హ్యాండ్ బ్యాగులు అందించారు.

## 'పేదరిక నిర్మూలనే జగన్ లక్ష్యం'

ప్రజాశక్తి - ఆచంట



పాలకోడేరులో...

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఆచంట సర్పంచి కోట సరోజినీవెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఆచంట గ్రామ సచివాలయం-2 పరిధిలో శుక్రవారం నిర్వహించారు. సచివాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ డిజిటల్ బోర్డు ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.

**పోడూరు :** పోడూరు సచివాలయం-2 పరిధిలో గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు అధ్యక్షతన వైఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వివరాలతో డిస్‌ప్లే ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సభలో జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు, ఎంపిపి సుమంగళి సాగర్ మాట్లాడారు.

**వీరవాసరం :** ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని వీరవాసరం సచివాలయం-1 వద్ద వైసిపి మండల కన్వీనర్ ధర్మారావు అధ్యక్షతన నిర్వహించారు.

**పాలకోడేరు :** మండలంలోని పాలకోడేరు సచివాలయం-2లో జగనే మళ్లీ ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి సచివాలయం పరిధిలో అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు చంటి రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు, వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, బ్రోచర్లు పంచారు.

## కేన్సర్ పరీక్ష కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళలకు కేన్సర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భీమవరం ప్రభుత్వాసుపత్రిలో మాత్రమే మహిళలకు కేన్సర్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## పైపులైన్ మరమ్మతు పనులు పరిశీలన

**ఉండి :** స్థానిక గాంధీనగర్‌లో పైపులైన్ దెబ్బ తినడంతో రెండు రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడిందని స్థానికులు సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణ్ వర్మ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన వారు వెంటనే మరమ్మతు పనులను ప్రారంభించారు. శుక్రవారం పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

## జాతీయస్థాయి పోటీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం రెండో సంవత్సరం విద్యార్థులు శిరీష, హైందవి, కీర్తి భీమవరం కెజిఆర్ఎల్ కళాశాలలో శుక్రవారం జరిగిన జాతీయ సదస్సు ఫార్మసిస్ట్‌ల పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలో రెండో బహుమతిని సాధించారని క్యాంపస్ ప్రొఫెసర్ టి.అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డిపార్ట్‌మెంట్ కోర్సు సమన్వయకర్త ఎస్.లిఖిత, ఫార్మసీ సిబ్బంది డాక్టర్ హీరాబట్టు, డాక్టర్ సురేంద్ర, నిత్యానంద్, పి.అరుణ అభినందించారు.

## పంచాయతీ అభివృద్ధికి కృషి

**మొగల్తూరు :** కొత్తపాలెం పంచాయతీ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా పని చేస్తున్నామని వైసిపి నాయకుడు లోకం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిప్పులేటి సురేష్ కుటుంబానికి కోర్టు అనుకూలంగా ఇచ్చిన స్థలంలో తాము ఏ విధమైన నిర్మాణాలు చేపట్టడం లేదన్నారు. కోర్టు తమకు అనుకూ లంగా ఇచ్చిన గ్రామకంఠం స్థలంలోనే నిర్మాణం చేపడుతున్నామన్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్‌నాయుడు మాట్లాడుతూ ప్రతినెలా 9, 10 తేదీల్లో గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## పరిస్థితి విషమించి విద్యార్థి మృతి

**గణపవరం :** రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వరదరాజపురం గ్రామానికి చెందిన మన్నే వెంకటదుర్గారావు (18) పెంటపాడు గోయింకా కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కాలేజీ నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. పిప్పర రాజ్‌అండ్‌రాజ్ కళ్యాణ మండపం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వెంకటదుర్గారావు తాడేపల్లిగూడెం చైతన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇటుకలగుంటలో విజయలక్ష్మి వర్ధంతి సభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని ఇటుకలగుంట గ్రామంలో ఉద్యమ నేత విజయలక్ష్మి వర్ధంతి సభను అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విజయలక్ష్మి చిత్రపటానికి మహిళలు నివాళులర్పించారు. మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు పాలుపూరి సత్యవతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.ధనలక్ష్మి భవాని, పి.సత్యవతి, పి.వెంకటనాగమణి, మన్ని సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల పంపిణీ నిరంతర ప్రక్రియ

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండలంలోని తూర్పుపాలెం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆచంట మండలంలోని కరుగోరుమిల్లి గ్రామం కండెల్లవారిపేటకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులు చెరుకువాడ శ్రీరంగనాథరాజును సత్కరించారు.

## గీత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. స్థానిక అమర వీరుల భవనంలో కల్లు గీత కార్మిక సంఘం తణుకు డివిజన్ 15వ మహాసభ గుబ్బల వీర రాఘవులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య ఆహ్వానితులుగా ప్రతాప్ హాజరై మాట్లాడారు. గీత కార్మికులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, గీత కార్మిక నాయకులు మామిడిచెట్టు నాగభూషణం, కట్టా వెంకటేశ్వరరావు, కడలి బాలాజీ పాల్గొన్నారు.





**CHANGE OF NAME**

I, MAMIDI VENKATA RATNA PRASAD S/o. Hanumaji Rao Resident of D.No. 13-30-1/1, Mamidi Vari Street, Tadepalligudem Town , W.G.Dist, A.P. I Have Changed My Name MAMIDI VENKATA RATNA PRASADU (OLD NAME) to MAMIDI VENKATA RATNA PRASAD (NEW NAME) . Hence forth Iam being called as MAMIDI VENKATA RATNA PRASAD (NEW NAME) For all Purpose

**ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) పోయినది**

TALUPURI VARA PRASAD అను నాకు DUBAI రాయబార కార్యాలయం అధికారులు ది.01-07-2020న X0804710 నెంబరుగల ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది. 1-11-2023న మా ఇంటి నుండి భీమవరం పట్టణం బ్యాంక్ కాలనీ వెళ్ళుచుండగా నా ఒరిజినల్ EC పోయినది. గాన నా ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను

TALUPURI VARA PRASAD
S/o. T. Uma Maheswara Rao
D.No. 19-25-3, Near Krishna Devaraya Kalyana Mandapam, Reddy Colony-1
BHIMAVARAM-534201, W.G.D., A.P.

**దస్తావేజులు పోయినవి**

పశ్చిమగోదావరి జిల్లా, గణపవం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులైన పెరుమళ్ళ వెంకటరావు గారి కుమారుడు వెంకటసాయి మనోహర్ అను నాకు డాక్యుమెంట్ నెంబర్ 2186/2001 (SRO, గణపవరం) ఒరిజినల్ డాక్యుమంట్ గణపవరం SBI సెంటర్ నుండి జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి వెలుతుండగా డాక్యుమెంట్ ఉన్న కవర్ మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబ్‌కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

పెరుమళ్ళ వెంకట సాయి మనోహర్
S/o. వెంకటరావు
గణపవరం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 81121184508

**లింక్ దస్తావేజు పోయినది**

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, సగ్గూరు వాస్తవ్యులు కొండవరదల (లేటు) రామకోటయ్య గారి కుమారుడు కొండవరదల శ్రీనివాసరావు పేరన సగ్గూరు గ్రామంలోని ఆర్.యస్. నెం. 57/1లో య. 0.46 సెంట్లు మరియు ఆర్.యస్. నెం. 57/2లో య. 0.90 సెంట్లు వెరశి య. 1.36 సెంట్లు భూమికి సంబంధించిన లింక్ దస్తావేజు (నెం. 156/1977) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

కొండవరదల శ్రీనివాసరావు
(తండ్రి) రామకోటయ్య
సగ్గూరు గ్రామం, ఆగిరిపల్లి మండలం
ఏలూరు జిల్లా, సెల్: 8977172369

**పదవ తరగతి మార్కులిస్ట్ పోయినది**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఎరిచెర్ల రత్నాకర్‌రావు అను నేను 15-10-2023 తేదీన నా పదవ తరగతి ఒరిజినల్ మార్కు లిస్ట్ నెం. 356888 ఇంటి దగ్గర నుంచి జిరాక్స్ షాపునకు తీసుకొని పెంటపాడు వెళుతున్న సమయంలో దారి మధ్యలో జారి పడిపోయినాయి. కావున పైన తెల్పిన ఒరిజినల్ టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ ఎవరికైనా దొరికినచో వెంటనే నాకు అందజేయవలెను. అట్లు అందించిన వారికి మంచి బహుమతి ఇవ్వబడునని ఇందు మూలంగా తెలియజేయుచున్నాను.

అడ్రస్: ఎరిచెర్ల రత్నాకర్‌రావు
S/o. కృష్ణ, చింతపల్లి గ్రామం
పెంటపాడు మండలం
పశ్చిమగోదావరి జిల్లా (ఎపి)
పిన్: 534196, సెల్: 9391865732

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో**
**ఓ.యస్. నెం. 433/2022**

బిట్వీన్:
జక్కంపూడి వెంకటేశ్వరరావు -వాది
మరియు
కవురు సుధాకర్ -ప్రతివాది

**వాది తరపున దాఖలు చేసిన ప్రకటన**

*ప్రతివాది:* కవురు సుధాకర్, తండ్రి: లేటు సత్యనారాయణ, డోర్ నెం. 22-71, ప్రకాశం రోడ్, అంబేద్కర్ కాలనీ, వేల్పూరు-534222, తణుకు మండలం, ప॥గో॥జిల్లా. తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు

పై నెంబరు దావా మీపై 2 ప్రాంశరీ నోట్ల ఆధారంగా మీ నుంచి రూ. 3,35,260/-లు వసూలు కావలెనని కోరుచూ దాఖలు చేయగా మీరు దావా సమన్లు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ఈ పబ్లికేషన్ తేది నుండి 30 రోజులలోపుగా శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

*వాయిదా తేది: 20-11-2023*

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.10-11-2023 సెల్: 9390018122

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో**
**ఓ.యస్. నెం. 16/2021**

బిట్వీన్:
నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి -వాది
మరియు
గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి వగైరా -ప్రతివాదులు

**వాది తరపున దాఖలు చేసిన ప్రకటన**

*1వ ప్రతివాది:* గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి, తండ్రి: గంగిరెడ్డి, డోర్ నెం. 3-107, శివాలయం వీధి, మల్లిపూడి - 534124, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

పై నెంబరు దావా మీ వగైరాలపై ది. 3-1-2018వ తేదీ ప్రాంశరీ నోటు ఆధారంగా రూ. 9,22,897/-లు వసూలు కావలెనని కోరుచూ దాఖలు చేయగా దావా సమను మీరు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజుల లోపుగా శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల సదరు దావా మీ పరోక్షము నందు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

*వాయిదా తేది: 17-11-2023*

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.10-11-2023 సెల్: 9390018122

**మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు**
**O.S.No.186/2023**

Between:
బాగం ఉమామహేశ్వర రావు ...వాది
మరియు
1)మాగంటి వెంకటలక్ష్మీ
2)జంగలి సత్యవతి
3)మాగంటి రామలక్ష్మీ
4)మద్దుల సునీత ...ప్రతివాదిలు

To,
1)మాగంటి వెంకటలక్ష్మీ, భర్త: లేటు బాబురావు, వయస్సు: 58 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-01సి, తాటికాకుల గూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా
2)జంగలి సత్యవతి, భర్త: సురేష్, వయస్సు: 40 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-02, తాటికాకుల గూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా
3)మాగంటి రామలక్ష్మీ, భర్త:సిద్దు, వయస్సు: 36 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-01సి, తాటికాకుల గూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా
4)మద్దుల సునీత, భర్త:శ్రీనివాస్, వయస్సు: 34 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: బండివారిగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా

వాది మీపై పైన తెలిపిన దావా దాఖలు చేసియున్నారు. దావా పై మీకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో మీరు ది.24-11-2023 తేదీన ఉదయం 10-30 గం॥లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు చెప్పుకోగలరు. లేనియెడల మీ పరోక్షములో తీర్మానం చేయబడుతుందని తెలియజేయడమైనది.

//కోర్టు వారి అనుమతితో//

వాయిదా:24-11-2023
కొత్తగూడెం,
08-11-2023
ఇట్లు
లక్కినేని సత్యనారాయణ,
న్యాయవాది-కొత్తగూడెం